# పల్లెకు పచ్చలహారం



దిలావర్‌పూర్‌లో కొత్త నర్సరీలో నాటిన విత్తనాలకు నీటినందిస్తున్న కూలీ

■ పచ్చదనంలో పరిఢవిల్లుతున్న గ్రామాలు ■ ఊరూరా నర్సరీలు ■ పనుల్లో నిమగ్నమైన అధికారులు

దిలావర్‌పూర్, నవంబర్ 9: ఎటుచూసినా పచ్చదనం.. అడవులను తలపిస్తూ పల్లెకు కట్టిన హరిత తోరణంలా పెనవేసుకుంటున్న చెట్లు ఇప్పుడు గ్రామాల సొంతం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తుండడంతో గ్రామాలు పచ్చదనంతో పాటు పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమానికి దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ప్రతి పంచాయతీకి 13 వేల మొక్కలను నాటేందుకు ఈ సారి అధికారులు చర్యలు చేపట్టారు.

గతేడాది కంటే ముందుగానే పనులు..

గతంతో చూస్తే హరితహారం కార్యక్రమం పనులు అనుకున్న దాని కంటే ముందుగానే అధికారులు చేపడుతున్నారు. గత హరితహారం కార్యక్రమంలో ప్రతి పంచాయతీకి 10 వేల మొక్కలను పెంచాలనే లక్ష్యం ఇవ్వగా, ఈ సారి 13 వేలకు మొక్కలను పెంచి ప్రజలకు, అటవీలో ఉండే వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచాలని సర్కారు నిర్ణయించింది.

### ప్రారంభమైన నర్సరీ పనులు..

12 గ్రామ పంచాయతీల్లో హరితహారం కార్యక్రమం పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి నర్సరీల్లో నిర్వాహకులు అవసరమైన మట్టిని సేకరించారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే బ్యాగ్ ఫిల్లింగ్ చేసి విత్తనాలు వేస్తున్నారు. మొత్తం 12 పంచాయతీల్లో 1 లక్షా 36 వేల మొక్కలను పెంచి గ్రామంలో అవసరమైన ప్రదేశాల్లో నాటించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ఈ నర్సరీలను ఏర్పాటు చేయడం వలన ప్రత్యక్షంగా గ్రామంలో 10 నుంచి 20 మందికి ఉపాధి కూడా దొరుకుతుంది.

### పచ్చదనంతో పరిఢవిల్లుతున్న గ్రామాలు...

గత హరితహారం కార్యక్రమంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలతో పచ్చదనం పెరిగింది. న్యూ లోలం, దిలావర్‌పూర్, కాల్వతాండ, సిర్గాపూర్, సముందర్‌పల్లి గ్రామాల్లో రోడ్డు వెంట నాటిన మొక్కలు చెట్లుగా మారి ఇరువైపులా చూపరులను అకట్టుకుంటున్నాయి.

### ప్రతి గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేశాం..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ప్రతి గ్రామంలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేసి విత్తనాలు నాటుతున్నాం. గతేడాది కంటే ముందుగానే ఈ సారి నర్సరీ పనులు చేపట్టాం.

**-మోహన్, ఎంపీడీవో దిలావర్‌పూర్**




తనిఖీలు చేస్తున్న పోలీసులు

# ఆధారాలుంటే డబ్బు వాపస్

■ ఎన్నికలతో సంబంధం లేకుంటే సరి
■ కోర్టుకు వెళ్లాల్సిన పనిలేదు
■ సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ
■ నిబంధనలకు మించి తీసుకెళ్లకుంటేనే బెటర్: అధికారులు

తానూర్, నవంబర్ 9 : గత ఎన్నికల సమయంలో ఎవరి వద్దనైనా రూ. 50 వేలకు మించి దొరికితే చాలు.. పోలీసులు సెక్షన్ 102 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసి ఆ డబ్బులను కోర్టులో డిపాజిట్ చేసేవారు. తర్వాత విడిపించుకోవడానికి బాధితులు సరైన సాక్ష్యాలు చూపి కోర్టు నుంచి రిలీజ్ ఆర్డర్ తెచ్చుకునేవారు. ఈ ప్రక్రియ ముగియడానికి మూడు నుంచి ఆరు నెలల సమయం పట్టేది.

### ఇప్పుడు రెండు రోజుల్లో ..

గతంలో డబ్బులు తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడిన సమయంలో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఎన్నికల సంఘం ఈ సారి కొత్త నిర్ణయం తీసుకుంది. డబ్బులు తీసుకెళ్తూ పట్టుబడిన ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపకుండా జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్ సెల్‌కు డబ్బులు అప్పగించాలని సూచించింది. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు,పోలీసులు చెక్‌పోస్టుల వద్ద డబ్బులు పట్టుకుంటే వాటికి సంబంధించి పంచనామా నిర్వహించి, సంబంధిత వ్యక్తికి రశీదు ఇస్తారు. అనంతరం ఆ నగదును గ్రీవెన్స్ సెల్‌లో ఉండే తిసభ్య కమిటీ (డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి. ఎన్నికల వ్యయ పరిశీలన పర్యవేక్షణ అధికారి, జిల్లా ట్రెజరీ అధికారి)కి అప్పగిస్తారు. ఈ కమిటీ ప్రతినిధులు ఆ నగదుకు ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదన్న ఆధారాలను పరిశీలించి, వెంటనే రిలీజ్ చేస్తారు. రూ. 10 లక్షలకు మించి పట్టుబడితే మాత్రం ఐటీ శాఖ నుంచి క్లియరెన్స్ పొందాల్సి ఉంటుంది. మండలంలోని బెల్‌తరోడ చెక్‌పోస్టు వద్ద ఈ నెల 13న మహారాష్ట్ర నుంచి వస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు ఆపి చెక్ చేయగా, రూ 1లక్షా 40వేలు దొరకడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్నికల నగదు గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించారు. ఆ డబ్బులకు ఎన్నికలకు సంబంధం లేదని బాధితుడు తగిన ఆధారాలతో గ్రీవెన్స్ సెల్ త్రిసభ్య కమిటీని కలవడంతో పరిశీలించి 3 రోజుల్లో డబ్బులు తిరిగి ఇచ్చేశారు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

–మీరు తీసుకెళ్తున్న డబ్బులు వ్యాపార లావాదేవీల కోసం అయితే వాటికి సంబంధించిన నగదు డ్రా చేసిన అకౌంట్ రసీదు. ఏటీఎం వివరాలు ఉండాలి

–భూ క్రయవిక్రయాలతో సమకూరిన డబ్బులకు సంబంధించిన డాక్యుమెంట్లు వెంట ఉంచుకోవాలి.

–పెళ్లి పనులు, బంగారం ఇతరాత్రా అవసరాల కోసం నగదు తీసుకెళ్తుంటే సంబంధిత పత్రాలు, పెళ్లి కార్డులు ఇతర ఆధారాలు ఉండాలి.

–అప్పు తీసుకున్నవారు లేదా అప్పు చెల్లించడం కోసం నగదు వెంట తీసుకెళ్తుట్లయితే ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు ఉంచుకోవాలి.

–ఆరోగ్య అవసరాల కోసం డబ్బులు తీసుకెళ్తున్నట్లయితే పేషెంట్ చికిత్స తీసుకుంటున్న ఆస్పత్రి నుంచి వైద్యం అందిస్తున్న పత్రాలతో పాటు ఆస్పత్రి నిర్వాహకుల ధ్రువీకరణ అవసరం ఉంటుంది.

### ఎన్నికలతో లింకు ఉండొద్దు



ఎన్నికల సమయంలో పట్టుబడిన డబ్బులకు ఎన్నికలతో లింకు ఉం డొద్దు. ఆలా అని ఆధారాలు చూ పితే తిరిగి డబ్బులు పొందడం సులువే. జిల్లా కేంద్రంలో ఉండే త్రిసభ్య కమిటీ పూర్తి స్థాయి ఆధారాలు పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత 2, 3 రోజుల్లో డబ్బులు తిరిగి వస్తుంది.**-కాంతీలాల్ పాటిల్, ఏఎస్పీ**

# ప్రగతి బాటన న్యూలోలం

■ పల్లెప్రగతితో మారిన రూపురేఖలు
■ జిల్లాలోనే ఆదర్శ పంచాయతీగా గుర్తింపు
■ సమకూరిన మౌలిక వసతులు



న్యూ లోలంలోని పల్లె ప్రకృతి వనం

దిలావర్‌పూర్, నవంబర్ 9: స్వరాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీ తన రూపురేఖలు మార్చుకుంది. సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం. ప్రతి పంచాయతీకి నెలనెలా నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి బాటలు వేసింది. అభివృద్ధిలో ఒక పంచాయతీకి మరో పంచాయతీ పోటీ పడి పనులు చేసే విధంగా పాలకులు, అధికారులను ప్రభుత్వం ప్రోత్సహించింది. మునుపెన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించింది. గ్రామంలో చెత్తను సేకరించేందుకు ట్రాక్టర్‌ను కొనుగోలు చేయించింది. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా ఉండేందుకు గాను ఆ గ్రామ జనాభా ఆధారంగా పంచాయతీ కార్మికులను నియమించింది. మండలంలోని న్యూ లోలం గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నది.

### పంచాయతీ మార్చిన పల్లెప్రగతి..

పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామం రూపురేఖలు మారిపోయాయి. మొదటి విడుత పల్లె ప్రగతి ద్వారా గ్రామంలో పనికిరాని బావులను కూల్చివేశారు. గ్రామంలో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసింది. గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయడంతో గ్రామం పచ్చదనంతో కళకళలాడుతున్నది. పల్లె ప్రగతి ద్వారా గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనంలో చిన్నారులు యువకులు ఆటలు ఆడుతున్నారు. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా మైదానం క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

### ఇంటింటికీ ఇంకుడుగుంత..

స్వచ్ఛ పంచాయతీలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించారు. భూగర్భజలాలను పరిరక్షించేందుకు గాను గ్రామంలో ఇంటింటికీ ఇంకుడుగుంతలను నిర్మించారు. దీనికి తోడు గ్రామంలో ప్రతి వార్డుకు సీసీ రోడ్డును వేయించారు.

### మోడల్ అంగన్‌వాడీ భవనం

నిర్మల్ జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా మోడల్ అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. భవనంలో చిన్నారులను ఆకట్టుకునే విధంగా అందమైన బొమ్మలను వేయించారు. రెండో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించేందుకు అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి రూ. 5 లక్షలు మంజూరు చేయడంతో భవనాన్ని ప్రారంభించారు. రూ. 20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నారు.

### జిల్లాలోనే మొదటి ఉత్తమ పంచాయతీగా గుర్తింపు..

పల్లె ప్రగతి కార్యక్రమం తీసుకువచ్చిన తరువాత పల్లె ప్రగతి కార్యక్రమాన్ని అమలు చేసిన గ్రామాల్లో నుంచి న్యూ లోలం గ్రామ పంచాయతీని మోడల్ పంచాయతీగా గుర్తించి అవార్డును అందించారు. ఈ పంచాయతీని పరిశీలించేందుకు రాష్ట్రస్థాయి బృందం కూడా వచ్చి అభినందించారు.



న్యూ లోలంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు



క్రీడా మైదానంలో ఆటలు ఆడుతున్న క్రీడాకారులు